క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో పీఠ పూజ



పాత గుంటూరు: కోటి గీతా లేఖన యజ్ఞ ప్రచార యాత్రలో భాగంగా జగద్గురు శ్రీమాన్ మధ్వాచార్య మూల మహా సంస్థానం ఉడిపి శ్రీ పుత్తిగే మఠాధిపతులు శ్రీ సుగుణేంద్ర తీర్థ పాదుల, సుశ్రీంద్ర తీర్థ పాదుల వారు శనివారం బృందావన్ గార్డెన్స్‌లోని వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని సందర్శించారు. ఆలయ అధ్యక్షుడు సి.హెచ్. మస్తానయ్య, ప్రధాన కార్యదర్శి బి.ఉమామహేశ్వరరావు, బొల్లేపల్లి సత్యనారాయణ, ఆవుల అచ్యుతరామయ్య, ఆలయ పూజారులు స్వామివారిని పూర్ణకుంభ స్వాగతం పలికారు. పద్మావతి కల్యాణమండపం వేదికగా ఆషాఢ బహుళ షష్ఠిని పురస్కరించుకొని అత్యంత భక్తిశ్రద్ధలతో పీఠ పూజ నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, హారతి, వేద మంత్రాలతో పీఠంలోని రుక్మిణి, సత్యభామాసమేత శ్రీ కృష్ణులవారిని సేవించారు. స్వామివారు అనుగ్రహ భాషణలో మానవాళికి సన్మార్గ సందేశానికి గీత పఠనం అత్యంత విశేషమన్నారు. విశ్వంలో సకల ప్రాణికోటికి కలిగే సకల సమస్యలకు ఏకైక పరిష్కార మార్గం గీత పారాయణం అన్నారు. భక్తులకు కోటి గీత లేఖన యజ్ఞం పుస్తకాలను అందించారు.

శ్రావ్యంగా శాస్త్రీయ సంగీత కచేరి

పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి దేవాలయం ప్రాంగణంలోని అన్నమయ్య కళావేదికపై డాక్టర్ వింజమూరి వరదరాజ అయ్యంగార్ జయంతి పురస్కరించుకొని గాయత్రీ మహిళా సంగీత సన్మండలి ఆధ్వర్యంలో శనివారం చెన్నై మోహన సంతానం బృందం చేసిన శాస్త్రీయ సంగీత కచేరి సంగీతాభిమానులను అలరించింది. ముఖ్య అతిథులుగా పులికాండ పిచ్చయ్య, మోదుగుల రవికృష్ణ, వింజమూరి సంధ్య, డాక్టర్ పి.విజయ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కచేరీని స్వరరంజని వర్ణంతో ప్రారంభించి వింజమూరి వారు రచించిన కృతులను శ్రావ్యంగా గానం చేశారు. కచేరీ అనంతరం సంస్థ ఉపాధ్యక్షురాలు మాధవపెద్ది మీనాక్షి, డాక్టర్ రాజరాజేశ్వరి, పాటిబండ్ల లలిత, కార్యదర్శి మంగాదేవి, మాధవీ కృష్ణ కళాకారులను, అతిథులను సత్కరించారు. సన్మండలి ప్రధాన కార్యదర్శి ఎం.వై.శేషరాణి పర్యవేక్షించారు.

గుంటూరు చానల్‌ను పొడిగించండి

జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్

గుంటూరు వెస్ట్: రైతుల అభివృద్ధి కోసం గుంటూరు చానల్ పొడిగించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని జనసేన నాయకుడు నాదెండ్ల మనోహర్ తెలిపారు. గత 11 రోజుల నుంచి స్థానిక కలెక్టరేట్ వద్ద నిరసన దీక్ష చేస్తున్న నల్లమడ ప్రాంత రైతుల పోరాట కమిటీకి సంఘీభావంగా శనివారం శిబిరాన్ని మనోహర్ సందర్శించారు. ఈ సందర్భంగా నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ గుంటూరు చానల్‌ను పర్చూరు వరకు పొడిగిస్తే అసంఖ్యాక రైతులు లాభపడతారన్నారు. తొలి దశలో రూ.113 కోట్లు విడుదల చేస్తే భూ సేకరణ జరుగుతుందన్నారు. సమావేశంలో రాజధాని రైతు సంఘం నాయకుడు అనుమోలు గాంధీ, డాక్టర్ కొల్లి రాజమోహన్‌రావు, జనసేన నాయకుడు కళ్యాణం శ్రీనివాసరావు (కేకే), ఆచార్య వేణుగోపాలరావు పాల్గొన్నారు.

అంబటి ఆశయాలను కొనసాగిస్తాం

గుంటూరు మెడికల్: జర్నలిస్టుల హక్కుల కోసం అలుపెరుగని పోరాటాలు చేసి హక్కుల సాధనే తన లక్ష్యంగా చేసుకుని అందరికీ ఆదర్శప్రాయుడైన అంబటి ఆంజనేయులు ఆశయ సాధన కోసం పనిచేస్తామని ఏపీయూడబ్ల్యూజే గుంటూరు జిల్లా నాయకులు పేర్కొన్నారు. శనివారం గుంటూరులోని ఎస్‌హెచ్‌ఓ కార్యాలయంలో అంబటి సంస్మరణ సభ జరిగింది. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. యూనియన్ నేతలు మాట్లాడుతూ ఆదర్శ జర్నలిస్టుగా అంబటి జీవన ప్రయాణం కొనసాగించారన్నారు. యూనియన్ ఉద్యమాలలో కీలకపాత్ర పోషించి అనేక ఉద్యమ పోరాటాలకు ఊపిరి పోసిన అంబటి జర్నలిస్టు హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

గుంటూరు ఈస్ట్: రెండు వేర్వేరు ఘటనల్లో రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న నలుగురు వ్యక్తులపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తుఫాన్‌నగర్ 2వలైనులో రేషన్ బి య్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచా రం పోలీసులు శనివారం దాడిచేశారు. తిరుమలశెట్టి రవికుమార్, తిరుమల, తిరుమలశెట్టి రవి, అనిల్‌లపై కేసు నమోదు చేశారు. 1770 కిలోల రేషన్ బియ్యం స్వా. దీనం చేసుకున్నారు.

రజకులపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

నెహ్రూనగర్: ప్రకాశం జిల్లా నూతలపాడు మండలంలో రజకుడిపై దాడి చేసినవారిని కఠినంగా శిక్షించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జనసేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రజకులపై దాడులు జరుగుతున్నాయని... వీటిని అరికట్టలంటే వారికి రక్షణ చట్టం కల్పించాలని విన్నవించారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని పేర్కొన్నారు.

పేదల గుండెల్లో చిరస్థాయిగా వైఎస్సార్

- పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్
- వాడవాడలా ఘనంగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి



స్తంభాలగరువులో మహానేత విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు



రెడ్డి హాస్టల్ ఆధ్వర్యంలో నగరంపాలెం సెంటర్‌లోని మహానేత విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

గుంటూరు ఎడ్యుకేషన్: పేద ప్రజల సంక్షేమం కోసం విస్తృత రీతిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిన మహానేత వైఎస్సార్ వారి గుండెల్లో నేటికీ సజీవంగా ఉన్నారని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. శనివారం మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పశ్చిమ నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో ఆయనకు నివాళులర్పిస్తూ జయంతి సభలు, కార్యక్రమాలను నిర్వహించారు. ఈసందర్భంగా 28, 30, 35, 36వ డివిజన్లలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే గిరిధర్ మాట్లాడుతూ మహానేత జయంతిని పురస్కరించుకుని నగరంలో విస్తృత రీతిలో సేవా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాలతో కార్పొరేట్ విద్య, వైద్యాన్ని పేద, మధ్య తరగతి వర్గాలకు చేరువ చేశారని కొనియాడారు. వైఎస్సార్ ఆశయాలకు అనుగుణంగా ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో పేదలకు అండగా నిలుస్తున్నారని అన్నారు. నాడు మహానేత కాంగ్రెస్ పార్టీని రెండు సార్లు అధికారంలోకి తెచ్చారని గుర్తు చేశారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధికి బాటలు వేసిన మహానేత బాటలో నడుస్తూ సీఎం వైఎస్ జగన్ అంతకు పదిరెట్ల స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వెల్లువలా నిర్వహిస్తున్నారని అన్నారు. పేద ప్రజల గుండె చప్పుడు తెలిసిన పరిపాలనాదక్షుడిగా అతి తక్కువ కాలంలోనే రాష్ట్ర ప్రజలందరి మన్ననలు చూరగొన్న వైఎస్ జగన్ తన పరిపాలన ద్వారా మహానేత పరిపాలనను గుర్తుకు తెస్తున్నారని అన్నారు. ఈసందర్భంగా 35వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ టీఎల్‌వీ ఆంజనేయులు ఆధ్వర్యంలో స్వామి థియేటర్ వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. 30వ డివిజన్ కార్పొరేట్ అచ్చాల వెంకటరెడ్డి ఆధ్వర్యంలో శ్రీరామ్‌నగర్‌లో పండ్లు పంపిణీతో పాటు మొక్కలు నాటారు. 36వ డివిజన్ కార్పొరేట్ ఉడుముల లక్ష్మీ శ్రీనివాసరెడ్డి, పార్టీ డివిజన్ అధ్యక్షుడు దుగ్గెంపూటి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో స్తంభాలగరువులోని మహానేత విగ్రహానికి నివాళులర్పించారు. 38వ డివిజన్ ఇన్‌చార్జ్ బోగిసం ప్రసాద్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఆయా కార్యక్రమాల్లో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ చైర్మన్ మందపాటి శేషగిరిరావు, 25, 33వ డివిజన్లు కార్పొరేటర్లు చంద్రగిరి కరుణకుమారి, గోపి శ్రీనివాస్, ఉడుముల అప్పిరెడ్డి, నాయకులు సూరసాని వెంకట్‌రెడ్డి, ఇన్నారెడ్డి, ప్రభు, నర్సిరెడ్డి, ఏరువ శివ శంకర్, డివిజన్ అధ్యక్షులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య ప్రదాత దివంగత వైఎస్సార్..

గుంటూరు మెడికల్: ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి నిరుపేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించిన ఘనత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డికే దక్కుతోందని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ అన్నారు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ పథకం



డాక్టర్ వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న, సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్

నేడు దేశ వ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో అమవుతోందని, ఆరోగ్యశ్రీ పథకంతో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. జీజీహెచ్ శుశ్రుత హాలులో శనివారం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మద్దు ప్రేమజ్యోతి బాబు ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు జరిగాయి. వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తూర్పు నియోజకవర్గ మహిళ నేత షేక్ నూరిఫాతిమా, సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ వేడుకలకు ముఖ్య అతిథులుగా విచ్చేసి డాక్టర్ వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా డాక్టర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకం ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులు ఉచితంగా ఉన్నత చదువులు చదువుకునేలా డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేశారన్నారు. ఆయన తనయుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తండ్రి ఒక అడుగు ముందుకు వస్తే ఆయన రెండు అడుగులు ముందుకు వేసి పేదలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు ప్రవేశపెట్టారన్నారు. డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ వేముల ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆషా సజని, తదితరులు పాల్గొన్నారు.

నగర శాఖ ఆధ్వర్యంలో..

ఏపీ హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంప్లాయిస్ యూనియన్ గుంటూరు జీజీహెచ్ శాఖ ఆధ్వర్యంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు జరిగాయి. ఆసుపత్రిలోని యూనియన్ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పలువురు నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. యూనియన్ అధ్యక్షుడు వి.యోహాన్, కోశాధికారి ఎం.రత్నం, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.గాబ్రియేల్, రాధారాణి, సునిల్, మనోజ్, సుబ్బారావు, తిరుమలాదేవి, ఆనందరావు, మాధవి, తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో..

పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ వైఎస్సార్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు జరిగాయి. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్‌కుమార్ కేక్ కట్‌చేసి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి వైద్య రంగానికి చేసిన సేవలను వివరించారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డీఎస్పీరావు శానిటైజర్లు, సిరంజీలు, సబ్బులు, మాస్కులను డాక్టర్ కిరణ్‌కుమార్ అందజేశారు. యూనియన్ నేతలు జయరావు, వై.వి.రావు, కె.ఎస్.రెడ్డి, చినసుభాని, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా వైఎస్సార్

నెహ్రూనగర్: దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి ఉభయ తెలుగు రాష్ట్ర ప్రజల హృదయాల్లో చెరగని ముద్రగా చిరస్థాయిగా నిలిచిపోయారని నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు తెలిపారు. శనివారం దివంగత మహానేత వైఎస్సార్ జయంతిని పురస్కరించుకుని పలు ప్రాంతాల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో మేయర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో దివంగత నేత వైఎస్సార్ పేదప్రజల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వినూత్నరీతిలో పాలన సాగించారన్నారు. ముఖ్యంగా పేదప్రజల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించి, వారి దేవుడై నిలిచారన్నారు.

రెడ్డి హాస్టల్ ఆధ్వర్యంలో..

నెహ్రూనగర్: నగరంపాలెంలోని రెడ్డి హాస్టల్ ఆధ్వర్యంలో వైఎస్సార్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం రెడ్డి హాస్టల్ నుంచి నగరంపాలెంలోని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి హాస్టల్ ప్రెసిడెంట్ చల్లా అంజిరెడ్డి మాట్లాడుతూ దివంగత నేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు ఎంతో మేలు చేశారని, ముఖ్యంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం ద్వారా పేద విద్యార్థుల భవితకు బాటలు వేశారన్నారు. రెడ్డి హాస్టల్ ప్రతినిధులు మోదుగుల పాపిరెడ్డి, పడాల సుబ్బారెడ్డి, సూరసాని వెంకటరెడ్డి, ఒనుకూరి సాంబిరెడ్డి, భవనం వెంకటరెడ్డి, జంగా సీతారామ్‌ప్రసాద్‌రెడ్డి, వాకా వెంకటేశ్వరరెడ్డి, పప్పుల సాంబిరెడ్డి, శ్యామల కోటిరెడ్డి, జంగా సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పార్టీ జిల్లా కార్యాలయంలో...

పట్నంబజారు: బడుగు, బలహీన వర్గాల బాధ్యతను భుజాన ఎత్తుకొని మైనార్టీల సంక్షేమం కోసం, దళిత వర్గాల అభ్యున్నతి కోసం పాటు పడిన మహనీయుడు దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి అని వైఎస్సార్ సీపీ నేతలు, ప్రజాప్రతినిధులు కొనియాడారు. వైఎస్సార్ జయంతి పురస్కరించుకుని శనివారం బృందావన్‌గార్డెన్స్‌లోని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ జిల్లా కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు.



మహానేత వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్ కావటి

ఈసందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ సంక్షేమ సారధిగా, పేదల కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి అంటే ఎలా ఉండాలో చూపెట్టిన ఘనత వైఎస్సార్‌కే దక్కుతోందన్నారు. తండ్రి అడుగుజాడల్లో తనయుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సైతం అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముందుకు సాగుతున్నారన్నారు. ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రరాష్ట్రంలో సుపరిపాలన అందించి ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్న మహనీయుడు వైఎస్సార్ అన్నారు. నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా మహానేత డాక్టర్ వైఎస్సార్ ముందుకు సాగారన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ పేదలపాలిట దైవంలా మహోన్నత పథకాలు అయిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీఎంబర్స్‌మెంట్ వంటి ప్రతిష్టాత్మక పథకాలు ప్రవేశపెట్టిన ఘనత డాక్టర్ వైఎస్సార్‌కే దక్కుతోందన్నారు. పార్టీ నేత మోదుగుల వేణుగోపాలరెడ్డి మాట్లాడుతూ కుల, మత, ప్రాంతాలకతీతంగా కొనసాగిన వైఎస్సార్ పాలన ఓ సువర్ణ అధ్యాయమన్నారు. డిప్యూటీ మేయర్ షేక్ షజిల, మహిళ నేత షేక్ నూరిఫాతిమా, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల నేతలు తాడిశెట్టి మురళీమోహన్, మాదిరెడ్డి శ్రీనివాసరెడ్డి, ఆవుల సుందరరెడ్డి, డాక్టర్ వై.షేక్, రిటైర్డ్ ఎస్పీ చెన్నంశెట్టి చక్రపాణి, పార్టీ నేతలు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, పలు కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.



నగరంపాలెం సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న అభిమాని

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కార్యాలయంలో..

గుంటూరు లీగల్: అపర భగీరథుడు, ఆరోగ్యశ్రీ ప్రదాత మహానేత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా స్థానిక వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, గుంటూరు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు పోలూరి వెంకటరెడ్డి, బార్ కౌన్సిల్ మెంబర్ రోళ్ల మాధవి, ఎస్సీ, స్పెషల్ పీపీ, ఏపీ సీబీడీ సోమసాని ధూన్సీలక్ష్మి, ఏపీపీలు కాసు వెంకటరెడ్డి, రమణారెడ్డి, సాగర్, సూరిబాబు, జ్యోత్స్న వైఎస్సార్ సీపీ గుంటూరు, పల్నాడు జిల్లాల కో–ఆర్డినేటర్ కొమ్మారెడ్డి రామకృష్ణారెడ్డి, క్రాంతి సుదర్శనం తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పోలూరి వెంకటరెడ్డి , న్యాయవాదులు

విద్యాప్రదాత డాక్టర్ వైఎస్సార్

వీసీ ఆచార్య పి.రాజశేఖర్



డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న వీసీ ఆచార్య పి.రాజశేఖర్

ఏఎన్‌యూ: సంయుక్త ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పేద, అణగారిన వర్గాలకు ఉన్నత, సాంకేతిక విద్యను చేరువ చేసిన విద్యా ప్రదాత డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి అని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో శనివారం నిర్వహించిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి వేడుకలకు వీసీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. యూనివర్సిటీలోని డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి, డాక్టర్ వైఎస్సార్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ చిత్రపటానికి వీసీ, యూనివర్సిటీ అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా డాక్టర్ వైఎస్సార్ చేపట్టిన సంస్కరణలు ఎప్పటికీ ఆదర్శనీయమన్నారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్ ద్వారా లక్షలాది మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అణగారిన వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యావంతులుగా, ఇంజనీర్లుగా, డాక్టర్లుగా తీర్చిదిద్దారన్నారు. ఏఎన్‌యూ అభివృద్ధికి కూడా ప్రత్యేక ప్రోత్సాహం అందించారని తెలిపారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ మాట్లాడుతూ విద్యారంగంలో డాక్టర్ వైఎస్సార్ ప్రవేశపెట్టిన సంస్కరణలు సదా అనుసరణీయమన్నారు. దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయకుమార్, ఐఎస్సీ డైరెక్టర్ ఆచార్య జి.చెన్నారెడ్డి, ప్రిన్సిపాల్స్ ఆచార్య పి.సిద్దయ్య, ఆచార్య ఎ.ప్రమీలారాణి, యూనివర్సిటీ అధికారులు ఆచార్య పి.కిరణ్మయి, ఆచార్య వెంకటరత్నమ్మ, ఆచార్య నాగరాజు, డాక్టర్ భవనం నాగకిషోర్, నరసారెడ్డి, ఉద్యోగ సంఘ నాయకులు వెంకటప్పారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

పొన్నూరు అభివృద్ధి నిరోధకుడు ధూళిపాళ్ల

- అవాకులు, చవాకులు పేలవద్దు..
- పద్ధతి ప్రకారమే భావన్నారాయణ స్వామి ఆలయ భూముల లీజు
- ముందు దుకాణాల సముదాయాలు, వెనుక ఆటోనగర్ స్థాపన
- విలేకర్ల సమావేశంలో పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య



మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

నగరంపాలెం: పొన్నూరు పట్టణంలోని భావన్నారాయణ స్వామి ఆలయ భూములపై తెలుగు దుష్ప్రచారాల పార్టీ (టీడీపీ) నేత ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడటం విడ్డూరంగా ఉందని పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య ఎద్దేవా చేశారు. గుంటూరు కృష్ణనగర్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో శనివారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పలుమార్లు ధూళిపాళ్ల నరేంద్ర ఎమ్మెల్యేగా గెలిచిన నియోజకవర్గంలో అభివృద్ధి జాడలేదని ఆరోపించారు. ఆయన హయంలో అరాచకాలు సృష్టించేవాడని, ఎవరైనా పనులు అడిగితే వారిపై కేసులు నమోదు చేయించిన ఘనత ఆయనదేనని ధ్వజమెత్తారు. పాడి లేకపోయినా పాడి రైతుగా పేరు నమోదు చేసుకుని సంగం డెయిరీని కైవసం చేసుకున్న ఘనుడని అన్నారు. పాడి రైతుల లాభాలను, ఉద్యోగులకు బోనస్‌లు ఇతరత్రా చెల్లించకుండా రూ.వందల కోట్లను కొట్టేసిన విషయం అందరికి తెలుసునని చెప్పారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రధానమైన నాలుగు హామీల్లో ఒకటైన ఆటోనగర్ ఏర్పాటు స్థాపనకై పొన్నూరులో ఎక్కడా ప్రభుత్వ భూమల్లేవని అన్నారు. దీంతో పట్టణంలోని భావన్నారాయణ స్వామి ఆలయ భూములలో 19.99 ఎకరాలు 11 ఏళ్ల లీజుపై పాలక మండలి దృష్టికి తీసుకొచ్చామని అన్నారు. దీనిపై తీర్మానం చేసి, దేవదాయ శాఖకు పంపించారని పేర్కొన్నారు. ఆ శాఖ అనుమతిస్తూ ఏపీఐసీసీకి పంపించిందని చెప్పారు. ఆటోనగర్‌లో దుకాణాలను అసోసియేషన్ సభ్యత్వాల ప్రకారం కేటాయింపు జరుగుతుందని, ఇందులో అన్ని వర్గాల వారు ఉంటారని చెప్పారు.ధూళిపాళ్ల నరేంద్ర దొరికిన కొద్ది దోచుకుని, ప్రస్తుతం నీతులు వల్లేయడం విడ్డూరమని మండిపడ్డారు. తండ్రి, సోదరుడు, కుమార్తెల పేర్లతో కాలనీల పేర్లతో అతి చౌకగా భూములు కొట్టేసిని ఘనుడు అని ధ్వజమెత్తారు. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ అభివృద్ధికి ఎనలేని కృషి చేశారని తెలిపారు. త్వరలో పొన్నూరు రోడ్ విస్తరణ పనులను ప్రారంభిస్తామని చెప్పారు. అదే విధంగా చేబ్రోలు దగ్గర్లోని కొమ్మమూరి కాలువపై రూ.36 కోట్లతో బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. కాకాని దర్గా లోపల, చుట్టు ప్రహరీ, రోడ్‌ను రూ.2 కోట్లతో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. క్వారీ బాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని సీజీఎఫ్, దాతల సహకారంతో రూ.1.50 కోట్లతో అభివృద్ధి చేసినట్లు తెలిపారు. ఇన్నేళ్లుగా అభివృద్ధి చేయని ధూళిపాళ్ళ అనవసరమైన ప్రకటనలు చేయవద్దని హితవు పలికారు.

ఆరోగ్యశ్రీని బలోపేతం చేద్దాం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ శనివారం ఓపీ వైద్య విభాగంలో ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ప్రధాన ద్వారం వద్ద ఉండాల్సిన ఆరోగ్య మిత్ర కౌంటర్ లేకపోవడాన్ని గమనించారు. వెంటనే ఆరోగ్య మిత్ర కౌంటర్‌ను తీసుకుని రావాలని ఆదేశించడంతో సిబ్బంది కౌంటర్‌ను తీసుకుని వచ్చి అక్కడ ఏర్పాటు చేశారు. ఆ కౌంటర్ కు ఒక కంప్యూటర్, ఇద్దరు ఆరోగ్య మిత్రలను ఏర్పాటు చేయాల్సిందిగా ఆదేశించారు. ఆరోగ్యశ్రీ సేవల గురించి రోగులకు వివరించడానికి మైక్‌ను కూడా అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వ పెన్షన్ దారులకు జీజీహెచ్‌లో ఈహెచ్ఎస్ సౌకర్యం లేదన్న ఆరోపణలు వస్తున్నాయని దానివల్ల ఆసుపత్రికి చెడ్డపేరు వస్తుందన్నారు. వెంటనే ఈహెచ్ఎస్ సౌకార్యాన్ని ఏర్పాటు చేసి పెన్షన్ దారులకు వైద్య సేవలను అందించాలన్నారు.

మెడికల్ స్టోర్స్ తనిఖీ..

డాక్టర్ కిరణ్‌కుమార్ మెడికల్ స్టోర్స్‌ను తనిఖీ చేశారు. అనంతరం నెఫ్రాలజీ వైద్య విభాగాన్ని తనిఖీ చేశారు. ఓపీలో మౌలిక వసతులు కల్పించేందుకు రెండు నెలల క్రితం నగదు ఇచ్చినా, పని చేయక పోవడంపై సూపరింటెండెంట్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం లోపు వసతులు కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. జీజీహెచ్‌లో మహాప్రస్థానం వాహనాల పనితీరును పరిశీలించారు.

గంజాయి కేసులో ముగ్గురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, వెనుక ముసుగులో నిందితులు, స్వాధీనం చేసుకున్న గంజాయి

గుంటూరు ఈస్ట్: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తితోపాటు, అతని వద్ద కొనుగోలు చేస్తున్న ముగ్గురిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. వెస్ట్ డీఎస్పీ ఉమామహేశ్వరరెడ్డి, ఎస్‌హెచ్‌ఓ రాజశేఖరరెడ్డిలు శనివారం పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. సాయినగర్‌లో టంగస్వామి పెరియస్వామి అనే వ్యక్తి గంజాయి విక్రయిస్తున్నాడన్న సమాచారం మేరకు పోలీసులు దాడిచేసి గంజాయి విక్రయస్తున్న పెరియస్వామితోపాటు, అతని వద్ద కొనుగోలు చేస్తున్న నడ్డిదుర్గా యశ్వంత్, షేక్ ఈసూబ్, పి.మహిమకుమార్‌లను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 1250 గ్రాముల గంజాయి, రూ.1500 నగదు, 4 ద్విచక్రవాహనాలు, ఐదు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు చేసి వారిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. డీఎస్పీ ఉమామహేశ్వరెడ్డి మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు అలవాటు భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. మత్తు పదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసినా నేరమన్నారు. అలాంటివారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదుపులోకి తీసుకున్న సిబ్బందిని అభినందించారు.

- పచ్చదనంగా మారనున్న కొండవీడు

యడ్లపాడు: అటవీశాఖ అధికారి ఎస్ రామచంద్రరావు కొండవీడును శనివారం సందర్శించా రు. రామచంద్రరావు మాట్లాడుతూ సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి, ఎవర్‌గ్రీన్ ఎర్త్ ఫౌండేషన్ అందించిన 600 మొక్కలను కొండవీడు కు తెప్పించి నిర్దేశించిన ప్రదేశాల్లో నాటేందుకు సిద్ధం చేసినట్లు చెప్పారు.